వాడవాడలా స్వచ్ఛతా హీ సేవ

నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు, జేసీ రాజకుమారి

మంగళగిరి: పరిశుభ్రమైన సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి పౌరుడిపై ఉందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. ఆదివారం స్వచ్ఛత హీ సేవ-2023, ఏక్ తారీఖ్.. ఏక్ గంట కార్యక్రమంలో పాల్గొని నగరంలో ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద స్వచ్ఛత హీ సేవ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కార్పొరేషన్ ప్రత్యేకాధికారి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.రాజకుమారి, నగర కమిషనర్ యు.శారదాదేవి, డెప్యూటీ కలెక్టర్ లలిత, అడిషనల్ కమిషనర్ హేమామాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజులతో పాటు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బందితో కలసి రోడ్ల వెంట పిచ్చిమొక్కలను తొలగించి చెత్తను సేకరించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగర పరిధిలోని ఎన్ఆర్ఐ జంక్షన్ నుంచి ప్రకాశం బ్యారేజి(గౌతమ బుద్ధా రోడ్డు), కనక దుర్గ వారధి నుంచి కాజ టోల్‌గేట్ వరకు, ప్రకాశం బ్యారేజి నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్ వరకు స్వచ్ఛత హీ సేవ ర్యాలీలు చేపట్టి రోడ్ల వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి చెత్తను సేకరించారు. జాయింట్ కలెక్టర్ బి.రాజకుమారి మాట్లాడుతూ పరిశుభ్రతతోనే దేశం ఆరోగ్యవంతమైన దేశంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఏడాదిలో ఒక రోజు శుభ్రం చేయడం కాదని నిత్యం మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, రమేష్ పాల్గొన్నారు.

ఇందిరానగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఎన్‌యూఎంటీఎం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, ఎన్‌యూహెచ్‌ఎం స్టేట్ డీఈఓ ప్రసన్న, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష వీధులను శుభ్రపరచారు.

డోకిపర్రులో..

మేడికొండూరు: గ్రామాల్లో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య కోరారు. మండల పరిధిలోని డోకిపర్రులో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొండేపోగు సామ్రాజ్యం, ఉప సర్పంచి షేక్ జానీ, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, కె.కోటేశ్వరరావు, ఉడతా ప్రభాకర్, డ్వాక్రా యానిమేటర్లు ఉడతా భాగ్యలక్ష్మి, ఎడ్ల శిరీష, నోసిన ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు తోట శివపార్వతి, గుంటుపల్లి నాగలక్ష్మి, కె.మణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. మేడికొండూరు సచివాలయం-1లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జేసీ రాజకుమారి, కమిషనర్ శారదాదేవి తదితరులు


దుగ్గిరాలలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ అరుణ

దుగ్గిరాల మండలంలో..

తాడేపల్లిరూరల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. దుగ్గిరాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను మనందరం పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడు అంటు వ్యాధులను దూరం చేయవచ్చని చెప్పారు. రైల్‌పేటలోని రోడ్డును శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం రిజిస్టర్ కార్యాలయం వద్ద, కళాశాల ప్రాంగణంలో ఉన్న రహదారులను శుభ్రం చేసి పిచ్చిమొక్కలు తొలగించి శ్రమదానం చేశారు. అనంతరం ఎంపీడీఓ కుసుమశ్రీదేవి స్వచ్ఛతే సేవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దుగ్గిరాల సర్పంచి బాణావత్ ఖుషీబాయి, ఈఓపీఆర్డీ పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రామలింగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, నాయకులు దాసరి వీరయ్య, దుగ్గిరాల ఉప సర్పంచి షేక్ నాగూర్, ఆత్మకూరు నాగేశ్వరరావు, బాణావత్ వెంకటేశ్వరరావు నాయక్ పాల్గొన్నారు. రేవేంద్రపాడులో సర్పంచి పలుకూరి మేరమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లపల్లి భారతిదేవి, మాజీ యార్డు చైర్మన్ కేసంనేని శ్రీధర్ పాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో....

తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో పలు ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని డ్వాక్రా సంఘాలు, కేఎల్‌యూ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కొలనుకొండ జాతీయ రహదారి వెంట ఉన్న సర్వీస్ రోడ్‌లో చెత్తాచెదారాన్ని తొలగించి రోడ్డు శుభ్రపరిచారు. స్వచ్ఛ భారత్‌పై పలు ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పాత టోల్‌గేట్, ఉండవల్లి సెంటర్, ప్రాతూరు క్రాస్‌రోడ్ మణిపాల్ సెంటర్ ప్రాంతాల్లో మెప్మా టీఎంపీ పావని పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు..

ఫిరంగిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష మండలంలోని ఫిరంగిపురం, వేములూరిపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో ఆదివారం నిర్వహించినట్లు సెక్టార్ వైద్యురాలు పి.ఎస్తేరురాణి తెలిపారు. ఇంటింటికి వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నామణి, ఆరోగ్య సిబ్బంది ఆనందకుమారి, భారతీజ్యోతి, మాబు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని ఫిరంగిపురం, రేపూడి, బేతపూడి, వేమవరం గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా చెరువు కట్టల వద్ద ముళ్లకంపలు, పొదలు ఆదివారం తొలగించారు. రేపూడిలోని చెరువు వద్ద శ్రమదానంలో భాగంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తెర సురేష్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు బి.బ్రహ్మానందరెడ్డి ముళ్లకంపలు, పొదలు తొలగించారు. కార్యక్రమంలో చిట్టా అంజిరెడ్డి, సర్పంచ్ అంజనీదేవి, మార్పులశివరామిరెడ్డి, పి.రఘు, కె.చిన్నప్పరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య,కార్యదర్శి గజేంద్ర, చిట్టా, శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.



పట్టణంలో రోడ్లు ఊడుస్తున్న మెప్మా ఆర్‌పీలు, డ్వాక్రా మహిళలు, సిబ్బంది


మేడికొండూరు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

ఫిరంగిపురంలో: కోనేరు చెరువువద్ద సర్పంచి మేడా బాబు, ఎంపీడీఓ డి.అనూరాధ, ఎంపీటీసీ సభ్యుడు లలక్ష్మయ్యలు పాల్గొని ముళ్లకంపలు, తొలగించి శ్రమదానం చేశారు. బేతపూడిలో గ్రామంలోని చెరువువద్ద సర్పంచ్ జి.ఆదంబీ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో జి.మస్తాన్‌వలి, ఖాజావలి, కార్యదర్శి లలితకుమారి, సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు. వేమవరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.శివకుమారి, సుధాకరరెడ్డి, కార్యదర్శి జీవీఆర్‌కే మూర్తి పాల్గొన్నారు.

తాడేపల్లిలో స్వచ్ఛ భారత్

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని ఓం శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి మరియు మణికంఠ దేవస్థానం కమిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాడికొండ: రోగాల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తాడికొండ ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

క్లుప్తంగా

వృద్ధులను గౌరవంగా చూడాలి

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా



మంగళగిరి: వృద్ధులను గౌరవంగా చూడాలని, వారితో నిర్లక్ష్యం వహించరాదని మంగళగిరి కోర్టుల సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా అన్నారు. మంగళగిరి కోర్టు ప్రాంగణంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులతో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్య తీసుకునేందుకు చట్టాలు ఉన్నాయని హెచ్చరించారు. స్తున్నారు. పెద్దలను మోసగించి ఆస్తులను రాయించుకున్నా తిరిగి వారికి ఇప్పించే విధంగా చట్టాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ రామకృష్ణ, బార్ అసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.లెనిన్‌బాబు, బీ నాయుడమ్మ, ఉపాధ్యక్షుడు ఎస్.బాలగౌరి, మహిళా సెక్రటరీ కె.రూపరాణి పాల్గొన్నారు.

నిర్మల్ హృదయ్‌లో అన్నదానం

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని నిర్మల్‌హృదయ్ అనాథశరణాలయం, కంద్రిక వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. రేపూడి గ్రామానికి చెందిన మార్నెళ్ల వెంకటేశ్వరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారులు ఆశ్రమాలలో అన్నదానం చేసి పండ్లు అందజేశారు. కార్యక్రమంలో శివరామిరెడ్డి, నిమ్మా విష్ణువర్ధన్‌రెడ్డి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

బేతపూడిలో..

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బేతపూడిలో వృద్ధులకు పండ్లు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఖాజావలి, ఎంపీటీసీ సభ్యుడు ఖాసిం షాహిద్ పాల్గొన్నారు.

220 మందికి వైద్యపరీక్షలు

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడిలో పెదకాకాని మాజీ సర్పంచి ఆళ్ల దశరథరామిరెడ్డి జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. 220 మందికి పరీక్షలు చేశారు. అందులో 50మంది మహిళలకు గైనిక్ పరీక్షలు చేసినట్లు వైద్యురాలు వసంత కిరణ్ తెలిపారు. బీపీ, షుగర్, కంటిపరీక్షలు, కిడ్నీ పరీక్షలు, వినికిడి, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, దంత సంబంధిత సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, ఎం.చంద్రకిరణ్‌రెడ్డి, డి.చెన్నారెడ్డి, ఎస్‌కే అబ్బాస్, సి.అజయ్, ఎం.చెంచురెడ్డి, కె.శ్రీవర్షిణి, ఎస్.రామప్రసాద్‌రెడ్డి, ఎం.పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాలను సర్పంచి పి.నాగమల్లేశ్వరి, ఉపసర్పంచి కె.పద్మావతి, పి.వెంకట్రామిరెడ్డి, కె.బ్రహ్మారెడ్డి పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



తాడేపల్లిరూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని గుంటూరు జిల్లా వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడులో ప్రకృతి విధానంలో పండించిన వరి పంటలను ఆదివారం పరిశీలించారు. ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఫెర్టిలైజేషన్ చేసి నాటిన వరి విత్తనాల పంటను, ఫెర్టిలైజేషన్ చేయకుండా నాటిన వరి విత్తనాల పంటల తేడాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ విద్యార్థులు, రాష్ట్ర కార్యాలయ అధికారిణి మీరాబి పాల్గొన్నారు.

భవ్యశ్రీ మృతిపై న్యాయం చేయాలి

రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు తురక రామారావు

తాడేపల్లిరూరల్: చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం వేణుగోపాల పురంలో భవ్యశ్రీ హత్యకు గురై 16రోజులు అవుతున్నా ఇప్పటి వరకు విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేయకపోవడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు తురక రామారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థిని భవ్యశ్రీ హత్య వెనుక ఉన్న వారిని ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. దక్షిణాది సంచార జాతుల అభివృద్ధి మండలి సభ్యులు తురక నరసింహం, కుంచాల కృష్ణకిషోర్ మాట్లాడుతూ వడ్డెర బాలిక భవ్యశ్రీ హత్య దారుణమని అన్నారు. నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల పద్మ, వేముల ఆంజనేయులు, తమ్మిశెట్టి ప్రశాంత్, బీసీ సంఘం నాయకులు మినుగ ఆంజనేయులు పాల్గొన్నారు.

• పెన్షన్ల పంపిణీ


ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో రోగికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ నాగేశ్వరరావు


మూడో వార్డులో వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉషా

నగరంలో పెన్షన్ల పంపిణీ ఆదివారం అయినా తెల్లవారుజామునుంచే వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది చేపట్టారు. నగరంలో మొత్తం పెన్షన్లు 39,836 మంది లబ్ధిదారులుండగా తొలిరోజు 28,094 మంది లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేశారు. మిగిలిన పెన్షన్లు రెండు రోజులలో లబ్ధిదారులందరికి ఇళ్ళ వద్దకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. - మంగళగిరి

మార్కేండేయ సొసైటీ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- ఘనంగా సొసైటీ 40వ వార్షికోత్సవం

మంగళగిరి: చేనేత కార్మికుల పిల్లలకు విద్యనందించేందుకు నలభై సంవత్సరాలుగా శ్రీ మార్కేండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణమండపంలో శ్రీ మార్కేండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 40వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 510 మంది విద్యార్థులకు రూ.15,42,000 ఉపకారవేతనాలు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవితో కలసి పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ శ్రీ మార్కేండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఉపకారవేతనాలు పొందిన చేనేత కార్మికుల పిల్లలు ఎందరో నేడు ఉన్నత స్థాయికి చేరుకుని సొసైటీకి సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. ముఖ్య అతిథి డాక్టర్ కేవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీ అందించిన ఉపకారవేతనాలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కన్నా మస్తారు, గౌరవాధ్యక్షుడు జొన్నాదుల బాబూ శివప్రసాద్, కమిటీ సభ్యులు దామర్ల కుబేరస్వామి, కనకలింగేశ్వరరావు, ఎం.లక్ష్మీనారాయణ, అందె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో మాజీ చైర్మన్ చిరంజీవి

సీనియర్ సిటిజన్‌లను గౌరవించాలి



తాడికొండ: సీనియర్ సిటిజన్‌లను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తాడికొండ, తుళ్లూరు తహసీల్దార్లు జీవీఎస్ ఫణీంద్ర బాబు, కల్యాణి అన్నారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదివారం తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో పలువురు వృద్ధులను సత్కరించారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

నగరంపాలెం: అరండల్‌పేటలోని శ్రీ మోహన రంగనాయక స్వామి వారి దేవస్థానం ఆవరణలో ఆదివారం రాధామాధవ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 304వ నెలనెలా వెన్నెలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వభారతి కూచిపూడి ఆర్ట్ అకాడమి (విజయవాడ), నటరాజ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నాట్యాలు సభికుల్ని అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు. అసోసియేషన్ నిర్వాహకులు షేక్ ఖలీల్, నృత్య దర్శకుడు ఎం.కాశీ విశ్వనాథ్, అనంతుల విజయకుమారి పాల్గొన్నారు.

ఎస్‌వీవీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

తాడికొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి 46 మంది విద్యార్థినిలు, 18 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పెరికల దేవరాజు, పీఈటీ సుంకర శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం పెరికల దేవరాజు, పీఈటీ సుంకర శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలఅభివృద్ధి సాధ్యమైందని తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మేరికపూడిలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నిధులతో సచివాలయం, ఆర్‌బీకే సెంటర్లకు ప్రహరీ నిర్మాణ పనులకు పదిలక్షలు కేటాయించారు. పూర్తి అయిన నిర్మాణ పనులు, గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన రూ.ఇరవై లక్షల నిధులతో సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రైయిన్లకు సంబంధించిన శిలాఫలకాలను ఆదివారం కత్తెర సురేష్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఆవిష్కరించారు. బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకే కేంద్రాల ద్వారా రైతన్నలకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. విదేశాలకు వెళ్లి విద్యార్థులు చదువుకోవాలంటే ఎంతో కష్టమైనదిగా ఉండేదని కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాల వలన గ్రామాల్లో ఉండే విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదివేందుకు వీలుగా మార్గదర్శకాలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, నాయకులు చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, పి.జేమ్స్ ఇన్నయ్య, పాలపాటి రఘు, పి.వెంకట్రామిరెడ్డి, కె.బ్రహ్మారెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, పి.చిన్న, టి.కృష్ణ, చౌదయ్య, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి 12వ తేదీ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు కోరారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ తాడేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో స్థానిక సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 40 ఏళ్ల నుంచి పీడబ్ల్యూడీ కాలువకట్టపై కుంచనపల్లి గ్రామ పరిధిలోని సుమారు 300 కుటుంబాల వారికి ఇల్లు తొలగిస్తామని ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇవ్వడం అన్యాయమని అన్నారు. సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ స్థానికంగా కాల్వకట్టపై నివాసం ఉంటున్న వారికి ఇళ్ల స్థలాలను రెగ్యులర్ చేసి, పేదలు ఉన్నచోటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, నాయకులు అమ్మిశెట్టి రామారావు, బిరుదుగడ్డ మోషే, ప్రకాష్, నాగార్జున పాల్గొన్నారు.

కాశయ్యకు పరామర్శ

తాడేపల్లిరూరల్: గెలిచినా గెలవకపోయినా సీట్లు ఉన్నా, లేకపోయినా ప్రజల పక్షంగా పోరాడేది ఎర్ర జెండానే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలో సీపీఐ సీనియర్ కంచర్ల కాశయ్యను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, బోర్ల శ్రీనివాసరావు, కంచర్ల క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జగనన్న కాలనీకి చెందిన వ్యక్తికి ఇస్త్రీ బండి ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో ఆదివారం అందజేశారు. పార్టీ నాయకులు అప్పారావుకు ఇస్త్రీ బండి అందజేశారు.

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడుకు చెందిన ఓ చిరు వ్యాపారికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో ఆదివారం బండ్లు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, 15వ సచివాలయ కన్వీనర్ సయ్యద్ సలాం పాల్గొన్నారు.

దుగ్గిరాలలో ఓ వ్యక్తికి బల్ల రిక్షా బండిని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి బాణావత్ కుషీబాయి, ఎంపీటీసీ సభ్యులు ద్వాలిబాయ్, కావ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మంగళగిరి: పట్టణంలోని పాతమంగళగిరి దింపుడు కళ్ళం వద్ద ఉన్న విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ గోవిందరాజు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పారేపల్లి మహేష్, ఉడతా శ్రీనివాస్, ఆలా శివాజీ, ఎనుముల నరసింహారావు, విజయ హెల్త్ ట్రస్ట్ కేర్ ప్రతినిధులు కాగితాల స్వాతిగౌడ్, బొడ్డేటి రమేష్, కాటూరి శ్యామ్, నాగబాబు పాల్గొన్నారు.